క్లుప్తంగా

వైభవంగా వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి ముక్కు కాశి రెడ్డి దంపతులు

కనిగిరి రూరల్: స్థానిక దేవాంగ నగర్‌లో గల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా సోమవారం పూర్ణాహుతిలో మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆలయధర్మ కర్త, కేటీఆర్ విద్యా సంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి దంపతులు, మానవతా సంస్థ కార్యదర్శి వాగిచర్ల వెంకటేశ్వర్లు దంపతులు విశిష్ట పూజలు చేశారు.

బాబా గుడిలో..

పట్టణంలోని షిరిడి సాయి బాబా దేవస్థానంలో అఖండ సాయి సప్తాహం వేడుకల్లో భాగంగా మూడో రోజు బాబావారికి, దత్తాత్రేయ స్వామికి, భవాని శంకర స్వామికి, ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి,ఆదిలక్ష్మమ్మ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

బింగినపల్లి కార్యదర్శి శ్రీనివాసరావు మృతి



సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాసరావు(50) సోమవారం అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఇతని మృతికి ఎంపీడీఓ నాగేష్‌కుమారి సంతాపం తెలిపారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి



వెలిగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ కమలకుమారి

వెలిగండ్ల: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.కమలకుమారి అన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాలలో ప్రత్యేకాధికారి ఎస్ సుశీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.కమలకుమారి ఆధ్వర్యంలో కిశోర బాలిక వికాసం, బాల్య వివాహాల నిరోధ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వి.కమలకుమారి మాట్లాడతూ బాలికలకు చిన్నతనం నుంచి మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. 18 ఏళ్లు నిండకుండా వివాహం చేయరాదన్నారు. అలా చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాల కారణంగా కలిగే నష్టాలను వివరించారు. తొలుత కేజీబీవీ నుంచి వెలిగండ్ల బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ బి.మేరిఉషశ్రీ, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొన్నలూరు: గ్రామాల్లో కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణచైతన్య అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. చర్మపై స్పర్శ లేకపోవడం, నొప్పి, దురదలేని మచ్చలు, చర్మంపై రాగి రంగు మచ్చలు, చేతులు, పాదాలు తిమ్మిర్లగా ఉండటం కుష్టు వ్యాధి లక్షణాలన్నారు. ఇంటింటికి సర్వే చేపట్టి అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. కుష్టు వ్యాధిని ఎండీటీ చికిత్సతో నయం చేయవచ్చన్నారు. డీపీఎంఓ దామా వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

కనిగిరి రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం- 2 ను సోమవారం చైర్మన్ గఫార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విధి నిర్వాహణలో నిబద్ధతగా ఉండి, ఆనారోగ్య స్థితిలో వచ్చిన వారికి తక్షణ వైద్య సాయం అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటి కప్పుడు వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్యం చేయాలన్నారు. అనంతరం రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించి సూచనలు ఇచ్చారు. డాక్టర్ ప్రియార్షనంద, స్టాఫ్ నర్సులు మేరి, దీపిక పాల్గొన్నారు.

బాబూ..మళ్లీ బురిడీయేనా..?

- నిరుద్యోగ భృతిపై వెయ్యి కళ్లతో యువత ఎదురుచూపులు
- ఇంత వరకు నోరు విప్పని ప్రభుత్వం
- మళ్లీ బాబు మోసం చేస్తాడేమోనని నిరుద్యోగుల్లో ఆందోళన



కనిగిరి రూరల్/సింగరాయకొండ: ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి..అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను తుంగలో తొక్కడంలో చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ప్రస్తుతం నిరుద్యోగ భృతి విషయంలోనూ ప్రభుత్వ జాప్యంపై నిరుద్యోగులంతా ఆందోళన చెందుతున్నారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు.

2014లోనూ ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అధికారంలో వచ్చిన చంద్రబాబు నిరుద్యోగులను నట్టేట ముంచారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా..ఇంత వరకు నిరుద్యోగ భృతి గురించి ప్రకటించకపోవడం, కనీసం చర్చించకపోవడం, మాట్లాడకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన రోజు రోజుకు ఎక్కువవుతోంది. 2014లోనూ నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు..2019 ఎన్నికలకు కొన్ని రోజులు మాత్రమే కొందరికి నిరుద్యోగ భృతి ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలు, మున్సిపాలిటీలోనే సుమారు 79 వేల కుటుంబాలు నిరుద్యోగ భృతి కోసం ఎదరుచూస్తున్నారు. కనిగిరి పట్టణంలో 7,500 కుటుంబాలు, కనిగిరి మండలంలో 21,421, పామూరులో 14 వేలు, హనుమంతునిపాడులో 7,500, వెలిగండ్లలో 8 వేల కుటుంబాళు, సీఎస్‌పురంలో 10వేల కుటుంబాలు, పీసీపల్లిలో 8,500 కుటుంబాలు నిరుద్యోగ భృతి కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

కొండపి నియోజకవర్గంలోనూ సుమారు 76 వేల కుటుంబాలు నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాయి. సింగరాయకొండలో 17,272, టంగుటూరు లో 16,290, మర్రిపూడిలో 9,416, పొన్నలూరులో 10,251, కొండపిలో 10,336, జరుగుమల్లిలో 12,310 గృహాలు ఉండగా ఇంటికి ఒకరి చొప్పున అంచనా వేసినా నియోజకవర్గంలో 75,875 మంది నిరుద్యోగులు ఉన్నారు.

ఎంతో మంది ఎదురుచూస్తున్నారు



ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి నెల దాటినా ఇంత వరకు ఆ ఊసే లేదు. పోస్టు గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు ఎందరో ఉన్నారు. వారందరికీ ఊరట కల్పిస్తూ ఉద్యోగ కల్పన గానీ, నిరుద్యోగ భృతి కూడా ఇవ్వాలి.

– పోతల ప్రభాకర్, పామూరు

ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నాను..



నేను ఎమ్మెస్సీ చదివాను. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. ఎన్నికల ముందు చంద్రబాబు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రకటించారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాను. ఉద్యోగం లేకపోతే నిరుద్యోగ భృతి కల్పించాలి.

– నన్నెసాని కార్తీక్, కంకణంపాడు.

నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి



నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల హామీ మేరకు వెంటనే అమలు చేయాలి. ప్రభుత్వం ఏర్పాటై నెల దాటినా ఇంత వరకు ప్రకటన చేయకపోవడం ఆందోళనగా ఉంది. జాబ్ క్యాలెండర్ తీసుకొచ్చి ఉద్యోగం కల్పించే వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. 2014లో కూడా నిరుద్యోగ భృతి ఇస్తానని మోసం చేశారు.

– కాకుమాని వెంకటేష్, జమ్ములపాలెం

హామీ నిలబెట్టుకోవాలి



ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఎన్నికల హామీని వెంటనే నిలబెట్టుకోవాలి. ప్రభుత్వం ఏర్పడి నెల దాటుతున్నా నేటికి భృతి పై ఎలాంటి స్పష్టత లేదు. గతంలో మాదిరి మాట తప్పుతారో లేక నిరుద్యోగ భృతి ఇస్తారో అర్థం కావడంలేదు. నిరుద్యోగ భృతి ఇచ్చి మాట నిలబెట్టుకోవాలి.

– పల్లకి శ్రీనివాసరెడ్డి, మర్రిపూడి

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల హామీని వెంటనే అమలు చేయాలి. నా లాంటి ఎంతో మంది నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారు. నెల రోజుల నుంచి ప్రభుత్వం ఇంత వరకు ఒక్క ప్రకటన కూడా చేయలేదు. ఇచ్చిన మాట ప్రకారం ఈ హామీని అమలు చేయాలి.

– నన్నిబోయిన చిరంజీవి, వలేటివారిపాలెం

నిరుద్యోగ భృతి ఊసేలేదు



నిరుద్యోగ భృతి అని మేనిఫెస్టోలో పెట్టారు కానీ దాని గురించి ఎవ్వరూ మాట్లాడడం లేదు. చంద్రబాబు నాయుడు గతంలో కూడా చివరి ఏడాది మొక్కుబడిగా కొందరికే ఇచ్చి చేతులు దులుపుకున్నాడు. ఈ సారి కూడా నిరుద్యోగులను మోసం చేసే విధంగా మార్గదర్శకాలు కూడా ప్రకటించకుండా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

– గోసుల రాజశేఖరరెడ్డి

రేపు సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమావేశం

పొన్నలూరు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం ఆవరణంలో 17న బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ సానుభూతి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించనున్నట్లు సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షురాలు సిరిగిరి శ్రీదేవి ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పిస్తారని, మండలంలోని వైఎస్సార్ సీపీ సానుభూతి సర్పంచులు, ఎంపీటీసీలు తప్పక పాల్గొనాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంఇఓగా శ్రీనివాసరావు

సింగరాయకొండ: ఎంఈఓ-1 గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు ఇన్‌చార్జిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎంఇఓగా పనిచేస్తున్న బి.శివన్నారాయణ ఉద్యోగ విరమణ చేశారు.

పాఠశాలకు బల్లల వితరణ



బల్లలు వితరణగా అందిస్తున్న గ్రామస్తులు

ఉలవపాడు: మండల పరిధిలోని పెద్దపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు ఆదే గ్రామానికి చెందినవారు ఆఫీస్ బల్లలను సోమవారం వితరణగా అందించారు. గ్రామానికి చెందిన ఆవులవాసు, తూపిలి రమేష్, ఊటుకూరి రాంబాబు, వాయల తిరుపతి రావు, తూపిలి శ్రీనివాసులు తోపాటు, పాఠశాలలో గణిత ఉపాధ్యాయిని గా పనిచేస్తున్న నీరజ సుమారు రూ.25 వేల విలువైన బల్లలను అందించారు. ప్రధానోపాధ్యాయుడు సలీమ్‌బాషాకు వీటిని అందించారు. పాఠశాలకు అవసరమైన సమావేశ మందిరం నిర్మించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దాతలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తా

- అవాస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరిస్తున్నారు..
- నా కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్ర
- రౌడీషీటర్ ఫిర్యాదు చేస్తే జిల్లా అధికారులు వేగంగా స్పందించడమేంటి.?
- విలేకరుల సమావేశంలో సర్పంచ్ తాటిపర్తి వనజ ఆవేదన



విలేకరుల సమావేశంలో ఆధారాలు చూపుతున్న సర్పంచ్ వనజ

సింగరాయకొండ: టీడీపీ కూటమి ప్రభుత్వంలో తనపై ఎన్నో కుట్రలు జరుగుతున్నాయని, పారదర్శకంగా పాలన చేస్తుంటే..ఈఓ చేస్తున్న అక్రమాలకు కొమ్ము కాస్తుందెవరని సర్పంచ్ తాటిపర్తి వనజ ప్రశ్నించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో తనపై జరుగుతున్న కుట్రలను, పంచాయతీలో జరుగుతున్న అవినీతిపై సర్పంచ్ వనజ మాట్లాడారు. ఈ పంచాయతీకి ఏ1 గ్రేడ్ కార్యదర్శిని పంపాలని జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తుంటే అవినీతి అధికారులను పంపిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా ఈ పంచాయతీలో విధులు నిర్వహించిన ప్రతి అధికారి అవినీతికి పాల్పడి లక్షలాది రూపాయలు దోచుకున్నారన్న ఆరోపణలున్నాయన్నారు. ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి పలు అవినీతి ఆరోపణలు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడని, అందుకు ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. దీనిపై జిల్లా అధికారులకు కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గుమస్తా సెలవులో ఉండటంతో అతని గది తెరిచేందుకు తేదీ నిర్ణయించామని, కానీ కార్యదర్శి తనకు తెలియకుండా గుమస్తాను పిలిపించుకొని రికార్డులు ఎందుకు తీసుకు వెళ్లారని ప్రశ్నించారు. గుమస్తా గదిలో పంచాయతీ ప్రజలకు చెందిన విలువైన సమాచారం ఉందని, ఆ సమాచారాన్ని భద్రత కల్పించాల్సిన బాధ్యత తనపై ఉందని, అందుకోసం కార్యదర్శి సమక్షంలో గుమస్తా గదికి మరో తాళం వేశానన్నారు. అయితే సమస్యను పక్కదారి పట్టించేందుకు గతంలో తనపై అవినీతి ఆరోపణలు చేసి భంగపడ్డ రౌడీషీటర్‌తో మళ్లీ మూడో సారి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. తనపై ఆరోపణలు చేసిన రెండుసార్లు..విచారణలో ఎటువంటి అవినీతి జరగలేదని డీఎల్‌పీఓ స్థాయి అధికారులు నిర్ధారించారని, కానీ ఇప్పుడు మళ్లీ మూడోసారి ఫిర్యాదు వస్తే జిల్లా అధికారులు వేగంగా స్పందించడం ఏంటని ప్రశ్నించారు. కార్యదర్శిపై అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకోమంటే మాత్రం కాలయాపన చేస్తున్నారని, అసలు కార్యదర్శికి సహకరిస్తున్న పెద్ద తలకాయ ఎవరు అని ప్రశ్నించారు. తనపై కుట్రలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, ఎంతవరకైనా వెళ్లి న్యాయపోరాటం చేస్తానని హెచ్చరించారు. అవసరమైతే మహిళా కమిషన్‌కు, జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తానన్నారు. తాను సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పారదర్శకంగా పాలన చేస్తున్నానని, పంచాయతీ ఖర్చులు గణనీయంగా తగ్గించానన్నారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకుని పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె జిల్లా అధికారులకు హితవు పలికారు. అప్రతిష్టపాలు చేసేందుకు రాజకీయంగా ఎన్ని కుట్రలు పన్నినా తాను ఎదుర్కొంటామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు షేక్ కరీం, షేక్ ముజీబ్, షేక్ కరిమున్, షేక్ నౌషాద్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కందుకూరు: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి అయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 10 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. పలు వ్యక్తిగత సమస్యలతో పాటు, రోడ్లు, డ్రైనేజీలు వంటి సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వీటిని ఆయా విభాగాల వారీగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్యం, ఇతర సమస్యలపై 9177700267 నంబర్‌కు ఫోన్ చేసి తెలపవచ్చునని సూచించారు.

హనుమంతునిపాడు: ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికకు రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కిషోర్‌రెడ్డి తెలిపారు. భూమి ఆన్‌లైన్ చేయాలని రెండు అర్జీలు వచ్చినట్లు చెప్పారు. ఏఓ కృష్ణారావు, ఎంఈఓ పెద్దిరాజు, ఏఓ గోపిక్రిష్ణా, అధికారులు పాల్గొన్నారు.

కొండపి(సింగరాయకొండ): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. కొలతలు వేయాలని రెండు, పాస్‌బుక్ ఆన్‌లైన్ కోసం ఒక అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి



భోజన ప్లేట్లు అందజేస్తున్న సీఐ, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం మరువలేనిదని సీఐ ఎం రామానాయక్, సింగిల్ విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పెదరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన దాతలు పాఠశాలలోని విద్యార్థులకు సమకూర్చిన భోజన ప్లేట్లు, పాఠశాలలో నీటి వసతి కోసం అందజేసిన వాటర్ బబుల్స్, ఫర్నీచర్ స్టాండ్స్‌ను సీఐ రామానాయక్, బోయళ్ల నారాయణరెడ్డి పాఠశాల విద్యార్థులకు, హెచ్‌ఎంకు అందజేశారు. విద్యార్థులు వచ్చే వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. దాతలు మానం నాగేశ్వరరావు, రామిశెట్టి మాల్యాద్రి, మల్లికార్జున, మానం గంగబాబులు నాయుడులను అభినందించారు. ఎస్సై ఎం ప్రేమ్‌కుమార్, అట్లూరి రామచంద్రరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మొహర్రం పెద షరిగత్తు

కనిగిరి రూరల్: మత సామరస్యానికి ప్రతీకగా జరిగే మొహర్రం(పీర్ల పండుగ) పెద షరిగత్ వేడుకలు మంగళవారం రాత్రి కనిగిరిలో జరగనున్నాయి. ఈమేరకు పట్టణంతో పాటు, వివిధ గ్రామాల్లోని పీర్ల చావిడ్లు(అషురా ఖాన)ల్లో కొలువు తీరిన పీర్లను ముజావర్లు సిద్ధం చేస్తున్నారు.

16న అర్ధ రాత్రి నుంచి గ్రామోత్స వేడుకలు

ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం వంశీకుల త్యాగ నిరతికి ప్రతీకగా నిర్వహించుకునే మొహర్రం పెద షరిగత్తు సందర్భంగా.. వివిధ గ్రామాల్లో చావిడ్లలో ప్రతిష్టించిన హజరత్(పీర్లకు) మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు జరుగుతాయి. కుల, మత, వర్గాలకతీతంగా భక్తులు పాల్గొని మొక్కుబడులు తీర్చుకుంటారు. ఆయా పీర్ల చావిడ్ల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత (తెల్లవారితే బుధవారం) పీర్ల అగ్ని గుండ ప్రవేశం ఉంటుంది. ముజావర్లు, మొక్కుబడులు ఉన్న వారు ఎంతో నియమ నిష్టలతో పీర్లను పట్టి అగ్ని గుండప్రవేశం చేస్తారు. ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారు. పట్టణంలోని సయ్యద్ మకానంలో అక్బర్ అలీ(గజ్జల పీరు) గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. అలాగే మయాన మకాన్‌లో ఇమామే హుస్సేన్, పాదిలి సాహెబ్ పీర్లను, శంఖవరంలో బారాయిమామ్(పెద్ద పీరు)ను, టకారిపాలెం, మంగళి మాన్యంలో ఇమామే ఖాశిం, గిద్దలూరి సాహెబ్, ఇమామే హసన్ పీర్లను గ్రామోత్సవానికి తీస్తారు. బుధవారం 17న తెల్లవారు జామున అన్ని మకాన్‌ల (చావిడ్ల)కు చెందిన పీర్ల సలాంల కార్యక్రమం పట్టణంలోని బొడ్డు చావిడి వద్ద అత్యంత వైభవంగా జరుగుతుంది. అలాగే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక పామూరు బస్టాండ్‌లో పీర్ల సలాముల ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పీర్ల సలాముల ఘట్టాన్ని వీక్షిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు ఆయా పీర్ల చావిడ్ల వద్ద మొక్కుబడుల కార్యక్రమాలు జరుగుతాయి. సయ్యద్ మకాన్ వద్ద హజరత్ అక్బర్ అలీ(గజ్జల పీరు) మొక్కుబడుల కార్యక్రమం అత్యంత నియమ నిష్టలతో, భక్తిశ్రద్ధలతో ముజావర్లు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు పీర్లు బావికి వెళ్లట (జలధి) కార్యక్రమం జరుగుతుంది. తదనంతరం 'అల్‌విదా (శోకాప్త గానం)తో' ముజావర్లు పీర్లను (వివిధ నామకరణాలు కల్గిన హజరత్‌లను) పీర్ల చావిడికి తెస్తారు.



సయ్యద్ మకానంలో ముస్తాబైన అక్బర్ అలీ (గజ్జల పీరు)

భక్తిశ్రద్ధలతో చినషరిగత్, గ్రామోత్సవం

పామూరు: మొహర్రం (పీర్లపండుగ)లో భాగంగా సోమవారం చినషరిగత్, పీర్ల ఊరేగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాతబస్టాండ్, కందుకూరు రోడ్డు, సీఎస్‌పురం రోడ్డు, కనిగిరి రోడ్డులలో ఉన్న పీర్లచావిళ్ల వద్ద నుంచి పీర్లను మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా ఊరేగించారు. పీర్లకు భక్తులు బెల్ల, బొరుగులను నైవేద్యం సమర్పించగా పీర్లతో ముజావర్లు భక్తులను ఆశీర్వదించారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.68 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,68,700 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.66,170, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.30,290, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.72,240 విరాళాలుగా వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు పాల్గొన్నారు.

పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన



మాట్లాడుతున్న తహశీల్దార్ భవాని శంకర్

కొండపి(సింగరాయకొండ): మండలంలోని కె.ఉప్పలపాడు, వెన్నూరు గ్రామాల్లో సోమవారం రైతులకు పంటసాగు హక్కు పత్రాలపై వీఏఏలు, వీఆర్‌ఓల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ కౌలుకు తీసుకునే రైతులకు కేవలం పంట పైనే అధికారం ఉంటుందని, భూమిపై ఎటువంటి అధికారం కౌలు రైతులు ఉండదన్నారు. కౌలు కార్డు కలిగిన రైతుకు భూ యజమానితో సమానంగా ఈ క్రాప్ నమోదు, సబ్సిడీ విత్తనాలు, పంటల బీమా, పంటల రుణాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు కోటిరెడ్డి, మల్లీశ్వరి, వీఏఏలు పాల్గొన్నారు.

సింగరాయకొండ: మండలంలోని పాకల పంచాయతీలోని తుఫాన్ షెల్టరు వద్ద సోమవారం కౌలు రైతు ధ్రువీకరణ పత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ భవాని శంకర్ మాట్లాడుతూ ఈ ధ్రువపత్రాల కాలపరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని ఆ సమయంలో వేసిన పంటపై మాత్రమే రైతుకు హక్కు ఉంటుందన్నారు. ఏడీఏ నిర్మలకుమారి, ఏఓ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

అర్జీలు నిల్

లింగసముద్రం: రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా మస్యల పరిష్కార వేదికార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరవైంది. మూడు వారాల నుంచి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక్క అర్జీ కూడా రాలేదు. తహసీల్దార్, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నా ప్రజల నుంటి ఎటువంటి స్పందన కనిపించలేదు.

అంబవరం జెడ్పీహెచ్‌ఎస్‌కు ఉపాధ్యాయుల నియామకం



విద్యార్థులతో సమస్యలు తెలుసుకుంటున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు): అంబవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు పనిసర్దుబాటు ద్వారా ముగ్గురు ఉపాధ్యాయులను నియమించినట్లు ఎంఈఓ రాజాల కొండారెడ్డి తెలిపారు. ఈనెల 13వ తేదీన సాక్షి దినపత్రికలో ' మాకు ఉపాధ్యాయులను ఇవ్వరా?' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా అధికారులు మండల విద్యాశాఖాధికారులతో క్షేత్రస్థాయిలో పరిస్థితులపై చర్చించి స్పందించారు. ఈసందర్భంలో సోమవారం పాఠశాలను క్షేత్రస్థాయిలో సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన మండల రెండవ విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులను పాఠశాలకు కేటాయించినట్లు తెలిపారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులను త్వరలో పాఠశాలలకు కేటాయిస్తామని డిప్యూటీ డీఈఓ ఎ.చంద్రమౌళీశ్వర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి మంచి ఫలితాలు తేవాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ హెచ్‌యం, సీఆర్‌పి ఉన్నారు.